మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి

మనం
జనం కోసం అక్షర యజ్ఞం...
ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు
గురువారం | 06 | ఆగస్టు | 2026 | పేజీలు : 10

# విశాఖలో ఐబీఎం ఫ్యూచర్ నౌ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్

## ప్రపంచవ్యాప్తంగా ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ సేవలకు మద్దతుగా సెంటర్ ఏర్పాటు


2వ పేజీలో

**విశాఖపట్నం , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎంవిశాఖపట్నంలో తన నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ను ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ సేవలకు మద్దతుగా విశాఖ ఇసుకతోట జంక్షన్ లోని లాన్సమ్ స్పేర్ భవనంలో ఐబీఎం సంస్థ ఏర్పాటుచేసిన ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను ఐబీఎం ఇండియా, సౌత్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐ గవర్నెన్స్ ఇంటిలిజెన్స్, కెమికల్స్ అండ్ పెట్రోలియం ఇండస్ట్రీ ఆపరేషన్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా కన్సల్టింగ్ సేవలు, ఏఐ(ఏ ఐ) ఫస్ట్ ట్రాన్స్ ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ను ఏర్పాటుచేయడం జరిగింది. భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిపై సంస్థ కొనసాగిస్తున్న పెట్టుబడులకు ఇది మరో కీలక ముందడుగు కానుంది. ఈ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖాతా దారులకు కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించనుంది. ఇందులో కృత్రిమ మేధస్సు (ఏ ఐ), హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా ఴ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నారు. అదేవిధంగా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ప్లాట్‌ఫార్మ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ ఇంజనీరింగ్, యూజర్ ఎక్స్‌పీరియన్స్

### అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణలో

# తీవ్ర నిర్లక్ష్యం

### రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి


2వ పేజీలో

**అనకాపల్లి / నక్కపల్లి , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఈ. లక్ష్మీరెడ్డి జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, జడ్పీ ఉన్నత పాఠశాల చిన్నదొడ్డిగల్లు, ఎంపీపీ పాఠశాల చిన్నదొడ్డిగల్లు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల, నక్కపల్లి మరియు ఎంఎల్‌ఎస్ పాయింట్, నక్కపల్లిలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా రికార్డుల నిర్వహణ, పోషకాహార పంపిణీ, గుడ్లు, పాలు సరఫరా, ఈ-స్టాక్ నిర్వహణలో అనేక తీవ్రమైన లోపాలు విలువడ్డాయి కేంద్రాలలో రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడం, టేక్ హోమ్ రేషన్ పంపిణీ రిజిస్టర్లను పూర్తిగా



2వ పేజీలో

## జనాభా గణన - 2027కు అధికారులు సమగ్రంగా సిద్ధం కావాలి

### జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు

**అనకాపల్లి , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** జనాభా గణన -2027 ను విజయవంతంగా నిర్వహించేందుకు అనకాపల్లిపట్టణ ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఉదయం జిల్లా స్థాయి ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్లకు జనాభా గణన నిర్వహణ విధానం, సమాచార సేకరణ, డిజిటల్ యాప్‌ల వినియోగం, గణనలో అనుసరించాల్సిన మార్గదర్శకాలు, క్షేత్ర

## బీసీల సంక్షేమానికి మరింత బలమైన చట్టం దిశగా అడుగులు

- బీసీ ప్రజాప్రతినిధులతో మంత్రి సవిత కీలక సమావేశం
- బీసీ చట్ట ముసాయిదా7పై మంత్రి అచ్చెన్నాయుడు సూచనలు


2వ పేజీలో

**అమరావతి/ విశాఖపట్నం , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ):** రాష్ట్రంలో బీసీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సామాజిక న్యాయానికి మరింత బలమైన చట్టాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అధ్యక్షతన బీసీ ప్రజాప్రతినిధులతో విజయవాడలోని ఫార్చ్యూన్ మురళి హోటల్లో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొని బీసీ చట్ట ముసాయిదాపై పలు విలువైన సూచనలు చేశారు. బీసీ వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాన్ని మరింత సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించేందుకు ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలను సమావేశంలో విస్తృతంగా



# విశాఖలో ఐబీఎం ఫ్యూచర్ నౌ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్

**ఒకటి తరువాయి** సేవలకు ఇది ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది.

**ఫ్యూచర్ రెడీ టెక్నాలజీ వర్క్ ఫోర్స్ అభివృద్ధే లక్ష్యం**

భారతదేశంలోని అభివృద్ధి చెందుతున్న సాంకేతిక కేంద్రాల్లో ఆవిష్కరణలు, సేవల సామర్థ్యాలను విస్తరించాలన్న ఐబీఎం లక్ష్యానికి ఈ ఫ్యూచర్‌నౌ సెంటర్ ప్రతీకగా నిలుస్తోంది. విస్తృత సాంకేతిక ప్రతిభ, బలమైన విద్యాసంస్థలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పర్యావరణ వ్యవస్థతో విశాఖపట్నం ప్రపంచ ఖాతాదారుల అవసరాలను తీర్చేందుకు అనువైన కేంద్రంగా ఎదుగుతోంది. ఈ సెంటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఐబీఎం తన కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక నైపుణ్యాలున్న మానవ వనరుల అభివృద్ధికి తోడ్పడాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలి**

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సేవలు, సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా విశాఖపట్నం ఆవిర్భవించడాన్ని ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటునందిస్తోంది. మా లక్ష్యం, కేవలం సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడం మాత్రమే కాదు, నాణ్యమైన ఉపాధిని సృష్టించడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేయడం, ఆంధ్రప్రదేశ్ యువత ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యేలా చేసే ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే మా లక్ష్యం. ఆంధ్రప్రదేశ్ పట్ల ఐబీఎం చూపుతున్న నిరంతర నిబద్ధతను మేం స్వాగతిస్తున్నాం. ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం విశాఖపట్నాన్ని భారతదేశంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఐబీఎంతో కలిసి పనిచేయడానికిఎదురుచూస్తున్నామని అన్నారు.

**ప్రపంచ ఆవిష్కరణల గమ్యస్థానంగా భారత్‌ను తీర్చిదిద్దుతాం**

ఈ సందర్భంగా ఐబీఎం ఇండియా, సౌత్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ మాట్లాడుతూ... వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో భారతదేశానికి డిజిటల్ యుగంలో ప్రపంచానికి నాయకత్వం వహించే అపూర్వ అవకాశం ఉంది. ప్రతిభ, ఆవిష్కరణలు, సాంకేతిక సామర్థ్యాలను సమన్వయం చేసుకుంటూ ఈ లక్ష్యాన్ని సాధించవచ్చు. ఐబీఎంలో మేం, మా ఖాతాదారులు ఏఐతో పాటు ఇతర అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను అందిపుచ్చుకుని, దీర్ఘకాలిక విలువను సృష్టించేందుకు అవసరమైన సామర్థ్యాలను నిర్మించడానికి కట్టుబడి ఉన్నాం. విశాఖపట్నంలోని ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ఏర్పాటు ఇందుకు నిదర్శనం. అలాగే ప్రపంచస్థాయి ఆవిష్కరణలు, సాంకేతిక సేవల కేంద్రంగా భారతదేశ స్థాయిని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.

**యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తాం**

ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ఇండియా మేనేజింగ్ పార్ట్‌నర్ ఉషా శ్రీకాంత్ మాట్లాడుతూ.. విశాఖపట్నంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రతిభ, బలమైన విద్యాసంస్థలు, టెక్నాలజీ ఎకోసిస్టమ్ వల్ల ప్రపంచ ఖాతాదారుల డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవసరాలకు మద్దతు ఇచ్చే కీలక కేంద్రంగా మారుతోంది. ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ ద్వారా అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను స్థానిక ప్రతిభతో సమన్వయం చేస్తాం. ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను వేగవంతం చేయడంతో పాటు, స్థానిక యువతకు మరింత మెరుగైన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.ప్రస్తుతం ఐబీఎం కన్సల్టింగ్ భారతదేశంలోని అహ్మదాబాద్, బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, కోయంబత్తూరు, గురుగ్రామ్, హైదరాబాద్, కొచ్చి, కోల్‌కతా, లక్నో, ముంబై, మైసూరు, నోయిడా, పుణె, విశాఖపట్నం సహా 15 ప్రాంతాల నుంచి ఫ్యూచర్‌నౌ సెంటర్లను నిర్వహిస్తోంది.

ఐబీఎం ప్రపంచవ్యాప్తంగా హైబ్రిడ్ క్లౌడ్, ఏఐ, వ్యాపార సేవల రంగాల్లో అగ్రగామి సంస్థ. 175కి పైగా దేశాల్లోని సంస్థలు తమ డేటా నుంచి విలువైన సమాచారాన్ని పొందడం, వ్యాపార ప్రక్రియలను సరళీకృతం చేయడం, వ్యయాలను తగ్గించడం, పోటీ సామర్థ్యాన్ని పెంచుకోవడంలో ఐబీఎం సేవలను వినియోగిస్తున్నాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్, టెలికమ్యూనికేషన్స్, హెల్త్ కేర్ వంటి కీలక మౌలిక సదుపాయాల విభాగాల్లోని వేలాది ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు తమ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్స్‌ను వేగంగా, సమర్థంగా, భద్రంగా అమలు చేసేందుకు ఐబీఎం హైబ్రిడ్ క్లౌడ్ ప్లాట్‌ఫాం, రెడ్ హ్యాట్ ఓపెన్ షిఫ్ట్ ను వినియోగిస్తున్నాయి. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన క్లౌడ్ సొల్యూషన్స్, వ్యాపార సేవల రంగాల్లో ఐబీఎం అందిస్తున్న వినూత్న సాంకేతికత వినియోగదారులకు సౌలభ్యవంతమైన, అనువైన పరిష్కారాలను అందిస్తోంది.అంతకుముందు ఐబీఎం సిబ్బందితో మంత్రి మాట్లాడారు. అందరూ గర్వపడే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐబీఎంకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# బీసీల సంక్షేమానికి మరింత బలమైన చట్టం దిశగా అడుగులు

**ఒకటి తరువాయి** చర్చించారు. చట్టం ద్వారా బీసీలకు మరింత రక్షణ, అభివృద్ధి అవకాశాలు కల్పించే అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బీసీ వర్గాల సంక్షేమం కోసం తీసుకువస్తున్న చట్టం ఆదర్శవంతంగా ఉండేలా ప్రభుత్వం అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటోందని తెలిపారు. బీసీల సాధికారతకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి హక్కులను మరింత బలోపేతం చేసేలా చట్టానికి తుది రూపు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

# జనాభా గణన - 2027కు అధికారులు సమగ్రంగా సిద్ధం కావాలి

**ఒకటి తరువాయి** స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్ర శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు మాట్లాడుతూ శిక్షణ పొందిన అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు తమ పరిధిలోని సిబ్బందికి సమర్థవంతంగా శిక్షణ అందించి జనాభా గణన- 2027ను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. జనాభా గణన- 2027 దేశ అభివృద్ధి ప్రణాళికలకు అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. శిక్షణ పొందిన అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో గణన సిబ్బందికి సమగ్ర శిక్షణ అందించి, జనాభా గణనను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ షేక్ ఆయేషా, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కె.శ్రీనివాస రావు, సిబ్బంది తరుణ్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు, పాల్గొన్నారు.

# తీవ్ర నిర్లక్ష్యం



**ఒకటి తరువాయి** నమోదు చేయకపోవడం, లబ్ధిదారుల సంతకాలు తీసుకోకపోవడం, పంపిణీ వివరాలను నమోదు చేయకపోవడం గుర్తించారు. చిన్నదొడ్డిగల్లు- I కేంద్రంలో ఈ-స్టాక్ మరియు భౌతిక నిల్వల మధ్య భారీ వ్యత్యాసం గుర్తించారు. ఈ-స్టాక్‌లో 1,052 గుడ్లు నమోదై ఉండగా, భౌతికంగా 258 గుడ్లు మాత్రమే ఉండటంతో 532 గుడ్లకు సంబంధించి తీవ్ర వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. చిన్నదొడ్డిగల్లు--II కేంద్రంలో హాజరు రిజిస్టరులో 9 మంది పిల్లలు మాత్రమే నమోదు చేసి ఉండగా, ఆన్‌లైన్‌లో 10 మంది పిల్లలను నమోదు చేసి, 10 మంది హాజరైనట్లు నమోదు చేయడం గుర్తించారు. అలాగే వాస్తవ పరిస్థితులను పరిశీలించకుండా సూపర్‌వైజర్ తనిఖీ చేసినట్లు సంతకం చేయడం తీవ్ర నిర్లక్ష్యమని పేర్కొన్నారు. చిన్నదొడ్డిగల్లు--III కేంద్రంలో టేక్ హోమ్ రేషన్ ను పంపిణీ చేయకముందే రిజిస్టర్లలో పంపిణీ చేసినట్లు నమోదు చేయడంతో పాటు, ఆగస్టు నెల పంపిణీ జరగకపోయినా లబ్ధిదారుల సంతకాలు తీసుకున్నట్లు చూపించడం అత్యంత తీవ్రమైన అవకతవకగా రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు అభివర్ణించారు. అదేవిధంగా సీడీపీఓ తనిఖీ నమోదు పుస్తకాలను నిర్వహించకపోవడం కూడా గుర్తించారు. గుడ్లు, పాలు నిల్వల లెక్కల్లో కూడా వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. కొన్ని కేంద్రాల్లో పిల్లలకు ఉదయం 11 గంటలు దాటినా గుడ్లు, పాలు పంపిణీ చేయకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్లక్ష్యం చిన్నారుల పోషకాహార హక్కుకు భంగం కలిగించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాల, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల, నక్కపల్లి మరియు ఎంఎల్ఎస్ పాయింట్, నక్కపల్లిలను కూడా పరిశీలించి మధ్యాహ్న భోజన పథకం, ఆహార నిల్వలు, నాణ్యత, రికార్డుల నిర్వహణపై అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం, పోషకాహార పంపిణీలో లోపాలు, పర్యవేక్షణ వైఫల్యాలపై సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, సీడీపీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, బాధ్యులపై తక్షణ శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి ఆదేశించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆహార భద్రత చట్టం- 2013 లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నాణ్యమైన ఆహారం, గుడ్లు, పాలు సకాలంలో పంపిణీ చేయడంతో పాటు అన్ని రికార్డులను ప్రతిరోజూ సక్రమంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని లక్ష్మీరెడ్డి హెచ్చరించారు. ఈ తనిఖీలలో జిల్లా అధికారులు కె.వి.ఎల్.ఎం. మూర్తి, జిల్లా సరఫరాల అధికారి (డీఎస్ఓ) టి. వెంకటరమణ, డిస్ట్రిక్ట్ మేనేజర్, సివిల్ సప్లైస్ ఎస్. సూర్యలక్ష్మి, ప్రాజెక్టు డైరెక్టర్ (ఐసిడిఎస్), జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) జి.జి.ఎస్. నాగేశ్వర రావు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ బి. రామచంద్రయ్య, ఫుడ్ సేఫ్టీ అధికారి బి. రవికుమార్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ మధురవాడ జోన్ ఏసీపీగా పి.గౌరు బాధ్యతల స్వీకరణ



**మధురవాడ , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** జీవీఎంసీ మధురవాడ జోన్ నూతన అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా పి.గౌరు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో పనిచేసిన ఎస్.శాస్త్రిఖబ్నమ్ కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ కాగా, వారి స్థానంలో డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆదేశాల మేరకు పి.గౌరు ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మధురవాడ జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...జోన్ పరిధిలో పట్టణ ప్రణాళికా నిబంధనలను సక్రమంగా అమలు చేస్తూ..ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పట్ల వరం




**లావేరు , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదల పట్ల పెద్ద వరమని స్థానిక ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదటి ఈశ్వరరావు ఉన్నారు ఈరోజు ఆంధ్రప్రదేశ్ సచివాలయం ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్న సెక్రటరీ కి సీఎం రిలీఫ్ ఫండ్ అప్లికేషన్స్ అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ అప్లికేషన్స్ ఇంతవరకు 220 అప్లికేషన్ కు సంబంధించి సుమారుగా రెండు కోట్ల 90 లక్షలు రూపాయలు బాధితులకు అందజేసినట్టు తెలిపారు అనారోగ్యం తో బాధపడుతున్న కుటుంబానికి రోడ్డున పడకుండా కొంత ప్రభుత్వం నుంచి సహాయం అందుకున్నప్పుడు అప్లికేషన్ ఒకటి కూడా మిస్ కాకూడదని ఉద్దేశంతో నేను స్వయంగా సీఎం ఆఫీస్ కి వెళ్లి ప్రతిసారి అప్లికేషన్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు కూటమి ప్రభుత్వ నిరుపేదలకు ఎప్పుడు అండగా ఉంటుందని కొనియాడారు

### కమ్యూనిటీ భాగస్వామ్యం ద్వారా భద్రతను మెరుగుపరచడానికి

# రూ.100 కోట్లు కేటాయించిన ఏఐ ప్లస్ స్మార్ట్‌ఫోన్

**విశాఖపట్నం , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** భారతీయ స్మార్ట్‌ఫోన్ రంగంలో ఒక విప్లవాత్మక చర్యగా, ఏఐ ప్లస్ స్మార్ట్‌ఫోన్ 'ప్రాజెక్ట్ ట్రస్ట్ ప్లస్ 'ను ప్రారంభించింది. దీర్ఘకాలిక కమ్యూనిటీ భాగస్వామ్యం ద్వారా దేశంలోనే అత్యంత సురక్షితమైన స్మార్ట్‌ఫోన్ ఎకోసిస్టమ్‌ను సృష్టించడానికి అంకితమైన ఒక సాహసోపేతమైన కార్యక్రమమిది. తమ పరికరాలలో భద్రతను మెరుగుపరచడానికి , నమ్మకాన్ని పెంపొందించడానికి టెక్ మరియు డెవలపర్ కమ్యూనిటీని ఆహ్వానించేందుకు, ఈ సంస్థ రాబోయే ఐదు సంవత్సరాల పాటు ఏటా రూ. 20 కోట్లు చొప్పున మొత్తం రూ.100 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమం ద్వారా కంపెనీ, తమ సిస్టమ్‌లను చురుకుగా పరీక్షించడానికి, తమ భద్రతా నిర్మాణాన్ని సవాలు చేయడానికి , వినియోగదారులపై ప్రభావం చూపకముందే పరిష్కరించగల లోపాలను ఎత్తి చూపడానికి ఈ సంస్థ స్వతంత్ర పరిశోధకులను ఆహ్వానిస్తోంది. భద్రత అనేది ఒక అంతిమ గమ్యం కాకుండా, నిరంతరం కొనసాగే ప్రయాణం అనే నమ్మకంతో 'ప్రాజెక్ట్ ట్రస్ట్ ప్లస్ నడుస్తోంది. డిజిటల్ ప్రపంచాలు మరింత అనుసంధానమవుతున్న తరుణంలో, సురక్షితమైన స్మార్ట్‌ఫోన్‌లను రూపొందించడానికి కమ్యూనిటీ నుండి సహకారం, పారదర్శకత, క్రియాశీల




భాగస్వామ్యం అవసరమని ఏఐ ప్లస్ నొక్కి చెబుతోంది. ఈ కార్యక్రమం, సాంప్రదాయ బగ్ బౌంటీ ప్రోగ్రామ్‌లకు అతీతంగా వెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని ద్వారా డెవలపర్లు, భద్రతా పరిశోధకులు మరియు ఎథికల్ హ్యాకర్లు సమిష్టిగా ఏఐ ఉత్పత్తుల భద్రతకు, పటిష్టతకు దోహదపడే ఒక బహిరంగ వాతావరణాన్ని ఇది ప్రోత్సహిస్తుంది అని ఏఐ ప్లస్ స్మార్ట్‌ఫోన్ సీఈఓ , నెక్స్ట్‌క్వాంటం షిఫ్ట్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు మాధవ్ షేత్ తెలిపారు. చాలా కంపెనీలు తమ పరికరాలు సురక్షితమని వినియోగదారులకు చెబుతాయి. మేము దానిని నిరూపించాలనుకుంటున్నాము. వాస్తవం ఏమిటంటే, ఏ స్మార్ట్‌ఫోన్, ఏ ప్లాట్‌ఫారమ్, లేదా ఏ టెక్నాలజీ ఎకోసిస్టమ్ కూడా భద్రత అనేది ఒక సంపూర్ణ గమ్యం అని చెప్పుకోలేదు. అది ప్రతిరోజూ అభివృద్ధి చెందుతూ ఉంటుంది. ప్రాజెక్ట్ ట్రస్ట్ ప్లస్ అనేది ఆ నమ్మకాన్ని పారదర్శకంగా, అందరి సహకారంతో నిర్మించాలనే మా విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. మేము భారతదేశ టెక్నాలజీ కమ్యూనిటీకి మా ద్వారాలను తెరుస్తున్నామని, ఎందుకంటే అత్యంత సురక్షితమైన ఉత్పత్తులు ఒంటరిగా కాకుండా, అందరూ కలిసి నిర్మించినవేనని మేము నమ్ముతున్నాము" అని అన్నారు.

# ఉత్తమ సహకార సంఘంగా ఆనందపురం...!!

**ఆనందపురం , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు 63వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని 99 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఆనందపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉత్తమ పనితీరు కనబరిచిన సంఘంగా తొలి బహుమతి కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా సంఘానికి ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు దక్కడానికి సహకరించిన భీమిలి శాసనసభ్యులు గంట శ్రీనివాసరావు, విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడు కోన తాతారావు, బ్యాంకు ప్రధాన కార్యనిర్వహణాధికారి డి.వి.ఎస్. వర్మ, జిల్లా సహకార అధికారి టి. ప్రవీణ, డివిజనల్ సహకార అధికారి పి.ఎన్.ఎల్. కిరణ్ కుమారి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు, ఉప ప్రధాన నిర్వాహకుడు ఎం. అశోక్ కుమార్, ఆనందపురం శాఖ మేనేజర్, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సంఘ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన సంఘ కార్యదర్శి ఎస్. నారాయణరావు, ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులు, రైతు మిత్రులు, సహకార సంఘ సభ్యుల సేవలు మరువలేనివని పేర్కొన్నారు. సభ్యులందరూ తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించడం వల్లే సంఘం ఆర్థికంగా బలోపేతమై రాష్ట్రస్థాయిలో ఉత్తమ సంఘంగా నిలిచిందని తెలిపారు. సంఘ అధ్యక్షులు పాండ్రంకి అప్పలరాజు బాగా శ్రమించారని ఏడాది వ్యవధిలోనే ఈ అత్యున్నత గుర్తింపు లభించడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. ఈ అవార్డు సంఘ పాలకవర్గం, అధికారులు, ఉద్యోగులు, సభ్యులు, రైతులు అందరి సమష్టి కృషికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ఇకపై కూడా సభ్యులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, సహకార రంగంలో ఆనందపురం సంఘాన్ని ఆదర్శ సంఘంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. సభ్యుల సహకారంతో సంఘం మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అందరికీ మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు.



# భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దే వేదికగా పీవీ సింధు స్పోర్ట్స్ అకాడమీ

**- క్రీడాకారులకు అవసరమైన సంపూర్ణ మద్దతు అందిస్తాం**
**- విశాఖలో పీవీ సింధు స్పోర్ట్స్ అకాడమీ భూమిపూజ కార్యక్రమంలో మంత్రి లోకేష్**

**విశాఖపట్నం , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** వేలాదిమంది భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దే వేదికగా పీవీ సింధు స్పోర్ట్స్ అకాడమీ నిలుస్తుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖలో పీవీ సింధు స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణ పనులకు భూమిపూజ అనంతరం ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడారు.ఎన్నో సంవత్సరాల క్రితం భారత జట్టు జెర్సీ ధరించాలని కలలు కన్న ఒక చిన్నారి ఉండేది. ప్రతి ఉదయం హైదరాబాద్ నగరం ఇంకా నిద్రలోనే ఉండగా... ఆమె అప్పటికే కోర్టులో సాధన ప్రారంభించేది. సాధన చేసేది. పాఠశాలకు వెళ్లేది. తిరిగొచ్చి మళ్లీ సాధన చేసేది. అప్పుడు కెమెరాలు లేవు, వార్తల్లో ఆమె పేరు లేదు, పతకాలు కూడా లేవు. ఉన్నది ఒక్కటే... క్రమశిక్షణ, త్యాగం. నిన్నటి కంటే ఈ రోజు మరింత మెరుగ్గా మారాలనే అచంచల సంకల్పం. ఈ రోజు ప్రపంచమంతా ఆమెను ఒలింపిక్ పతక విజేతగా, ప్రపంచ ఛాంపియన్‌గా, భారతదేశపు అత్యంత గొప్ప క్రీడా దిగ్గజాల్లో ఒకరిగా గుర్తిస్తోంది. మనం గర్వంగా ఆమెను మన సోదరి పీవీ సింధు అని పిలుస్తున్నాం.

**పీవీ తల్లిదండ్రుల త్యాగం ఎనలేనిది**

ప్రజలు పతకాన్ని చూస్తారు. కానీ ఆ పతకం వెనుక ఉన్న ప్రయాణాన్ని ఎప్పుడూ చూడరు. ప్రతి ఛాంపియన్ వెనుక ఎదురు చూసిన ఒక తల్లి ఉంటుంది. నమ్మకం కోల్పోని ఒక తండ్రి ఉంటారు. ఎప్పుడూ వెనుకంజ వేయని ఒక కోచ్ ఉంటారు. ఈ రోజు పీవీ రమణ కి, పి. విజయ కి నా హృదయపూర్వక వందనాలు తెలియజేస్తున్నాను. వారు ఒలింపిక్ పతకాలు గెలవలేదు. కానీ భారతదేశానికి ఒక ఒలింపిక్ ఛాంపియన్‌ను అందించారు. అలాగే ప్రతి కోచ్‌కు కూడా నా వందనం. ఎందుకంటే ఛాంపియన్లు ఒక్క రాత్రిలో తయారు కారు. వారిని సహనం, క్రమశిక్షణ, అచంచల విశ్వాసంతో తీర్చిదిద్దుతారు.

**వేలాదిమంది భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దే వేదిక పీవీ సింధు అకాడమీ**

కొన్ని వారాల క్రితం వివిధ అంతర్జాతీయ క్రీడా పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించబోతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారులందరినీ కలిసే అవకాశం నాకు లభించింది. ఆ సాయంత్రం సింధు కూడా ఎంతో ఆప్యాయంగా మాతో కలిసి విందులో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆమె చెప్పిన ఒక మాట నా మనసులో బలంగా నిలిచిపోయింది. తాను ఇప్పుడు 19 ఏళ్ల యువ క్రీడాకారిణిని కాదని అన్నారు. ఆ మాట నన్ను ఎంతో ఆలోచింపజేసింది. ఎందుకంటే.. ఆమె లక్ష్యం ఇప్పుడు కేవలం పతకాలు గెలవడమే కాదు. తాను చేసిన ఈ ప్రయాణాన్ని, తాను పొందిన అనుభవాన్ని ఎలా ఒక వ్యవస్థగా రూపుదిద్దాలి, వాటిని తర్వాతి తరాలకు ఎలా అందించాలన్నదే ఆమె ఆలోచన. తన లెగసీని ఎలా కొనసాగించాలి, తన నుంచి ప్రేరణ పొందిన తరతరాల క్రీడాకారులు ఎదగాలంటే ఏం చేయాలనే దిశగా ఆమె ఆలోచిస్తున్నారు. ఆ స్ఫూర్తితోనే విశాఖపట్నంను క్రీడా రంగంలో ఒక గొప్ప కేంద్రంగా మార్చగలమనే విశ్వాసం ఆమెకు ఉంది. అందుకే ఈ రోజు వారందరూ మీ అందరి ముందుకు వచ్చి నిలబడ్డారు. ఈ రోజు మనం కేవలం ఒక భవనానికి శంకుస్థాపన చేయడం లేదు. వేలాదిమంది భవిష్యత్ ఛాంపియన్ల జీవిత ప్రయాణానికి తొలి అధ్యాయాన్ని లిఖిస్తున్నాం. బహుశా తదుపరి ఒలింపిక్ ఛాంపియన్ ఇక్కడే మన మధ్య కూర్చుని ఉండవచ్చు. తాను ఒక రోజు ప్రపంచ వేదికపై నిలుస్తానని ఆ చిన్నారికే ఇంకా తెలియకపోవచ్చు. ఆ సామర్థ్యాన్ని గుర్తించే అవకాశం ఆ చిన్నారికి కల్పించడం మనందరి బాధ్యత.

**పీవీ సింధు వ్యక్తిగత కల అందరి కలగా మారింది**

ప్రపంచంలోని అగ్రశ్రేణి క్రీడా దేశాలన్నింటిలో ఒక విషయం మాత్రం కామన్ గా కనిపిస్తుంది. వారు ఛాంపియన్లు జన్మించాలని ఎదురుచూడరు. ఛాంపియన్లు తయారయ్యే వాతావరణాన్ని సృష్టిస్తారు. ఆస్ట్రేలియా ఆస్ట్రేలియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌ను నిర్మించింది. ఖతార్ ప్రపంచ ప్రఖ్యాత అస్పైర్ జోన్‌ను అభివృద్ధి చేసింది. ఇండియా ఇన్‌స్పైర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ సంస్థలు తమ దేశాలకు గర్వకారణమైన అనేక మంది క్రీడాకారులను తీర్చిదిద్దాయి. ఎందుకంటే గొప్ప దేశాలకు ఒక సత్యం తెలుసు. ఒలింపిక్ పతకాలను క్రీడాకారులు గెలుస్తారు, కానీ ఒలింపిక్ కలలకు పునాది వేసేది సంస్థలే. ఈ అకాడమీ కూడా ఒక కలతోనే ప్రారంభమైంది. అది సింధు హృదయానికి ఎంతో దగ్గరైన ఒక కల. కానీ ఆ కలను ఆమె మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తో పంచుకున్నప్పుడు, ఆయన ఆమెను కేవలం బ్యాడ్మింటన్ మాత్రమే ఎందుకని ఒక సింపుల్ క్వశ్చన్ అడిగారు. ప్రతి క్రీడలోని పిల్లలు నేర్చుకునేలా, శిక్షణ పొందేలా, అత్యుత్తమ ప్రతిభ కనబరిచేలా ఒక కేంద్రాన్ని ఎందుకు నిర్మించకూడదని ప్రశ్నించారు. ఆ ఒక్క ప్రశ్న అన్నింటినీ మార్చేసింది. ఒక వ్యక్తిగత కల అందరి కలగా మారింది. ఒక భాగస్వామ్య దార్శనికతగా రూపుదిద్దుకుంది.

**అన్ని రకాల క్రీడలకు నిలయంగా పీవీ సింధు అకాడమీ**

ఒక భవనాన్ని నిర్మించడం, ఒక శాశ్వత వారసత్వాన్ని నిర్మించడం మధ్య ఉన్న తేడా అదే. ఈ రోజు ఇది కేవలం ఒక బ్యాడ్మింటన్ అకాడమీ మాత్రమే కాదు. ఇది బ్యాడ్మింటన్‌కు, స్విమ్మింగ్‌కు, జిమ్నాస్టిక్స్‌కు, షూటింగ్‌కు, వెయిట్‌లిఫ్టింగ్‌కు, బాస్కెట్‌బాల్‌కు, ఫుట్‌బాల్‌కు వేదికగా నిలవనుంది. అంకితభావంతో ఈ గడప దాటి లోపలికి అడుగుపెట్టి, జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యంతో బయటకు వచ్చే ప్రతి యువ క్రీడాకారుడికి ఒక నిలయంగా నిలుస్తుంది. క్రీడలపై మక్కువతో ఈ ప్రాంగణంలో అడుగుపెట్టే ప్రతి యువ క్రీడాకారుడు స్పష్టమైన లక్ష్యం, ఆత్మవిశ్వాసంతో బయటకు వెళ్లేలా తీర్చిదిద్దడమే మా సంకల్పం. ఈ దార్శనికతకు ప్రతిరూపంగానే ఈ క్యాంపస్‌లో ప్రతిపాదించిన మల్టీ-స్పోర్ట్స్ సెంటర్ రూపుదిద్దుకుంటోంది.

**భవిష్యత్ ఛాంపియన్ల గమ్యస్థానంగా ఏపీ నిలుస్తుంది**

ఇన్నేళ్లుగా భారతదేశ యువ క్రీడాకారులు ప్రపంచంలోని గొప్ప క్రీడా సంస్థల్లో శిక్షణ పొందేందుకు విదేశాల వైపు చూశారు. భారతదేశం నలుమూలల నుంచి యువ క్రీడాకారులు.. తాము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అందమైన విశాఖపట్నంలో ఏర్పాటు కానున్న పీవీ సింధు సెంటర్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్‌లో శిక్షణ పొందాలని కోరుకుంటున్నామని చెప్పే రోజు కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఆ రోజు వచ్చినప్పుడు నాకు ఎంతో గర్వంగా ఉంటుంది. ఎందుకంటే, అప్పటికి ఆంధ్రప్రదేశ్ కేవలం ఛాంపియన్లను తయారు చేసే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, భవిష్యత్ ఛాంపియన్లు తమ కలలను సాకారం చేసుకోవడానికి దేశం మొత్తం నుంచి వచ్చే గమ్యస్థానంగా కూడా గుర్తింపు పొందుతుంది.

**భవిష్యత్ తరాలకు పీవీ సింధు బాసటగా నిలుస్తున్నారు**

భారతదేశానికి ఎన్నో పతకాలు అందించినందుకు మాత్రమే కాకుండా భవిష్యత్ తరానికి తిరిగి అందించాలనే గొప్ప సంకల్పాన్ని ఎంచుకున్నందుకు పీవీ సింధుకు నా హృదయపూర్వక అభినందనలు. ఈ మహత్తర దార్శనికతను సాకారం చేయడానికి అంకితభావంతో కృషి చేస్తున్న దత్తాని కూడా అభినందిస్తున్నాను. అలాగే ఈ అకాడమీ ఒకే క్రీడకు పరిమితం కాకుండా, ఒకే క్రీడాకారుడి వరకే ఆగిపోకుండా, ఒకే తరం వరకే పరిమితం కాకుండా, విస్తృత దార్శనికతతో ముందుకు సాగేందుకు ప్రోత్సహించిన సీఎం చంద్రబాబు నాయుడు కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అదే నిజమైన నాయకత్వం.




**విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం**

ప్రతి చిన్నారి డాక్టర్ కాలేడు, ప్రతి చిన్నారి ఇంజనీర్ కాలేడు. ప్రతి చిన్నారి శాస్త్రవేత్త కాలేడు. అలాగే ప్రతి చిన్నారి ఒలింపియన్ కూడా కాలేడు. కానీ ప్రతి చిన్నారి ఒక ప్రత్యేకమైన ప్రతిభతోనే జన్మిస్తుంది. ప్రతి చిన్నారిలో దాగి ఉన్న సహజ ప్రతిభను గుర్తించేందుకు దోహదపడటం ఒక మంచి విద్యా వ్యవస్థ, ఒక మంచి ప్రభుత్వ బాధ్యత. అదే మా నిబద్ధత. విద్యాశాఖ మంత్రిగా విద్య, క్రీడలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నాం. తరగతి గది జ్ఞానాన్ని పెంపొందిస్తుంది. ఆటస్థలం వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది. తరగతి గది ఎలా ఆలోచించాలో నేర్పుతుంది. ఆటస్థలం. ఎలా పోరాడాలో నేర్పుతుంది. ఈ రెండూ ముఖ్యమైనవే. అందుకే మన పాఠశాలల్లో నో బ్యాగ్ డేను ప్రవేశపెట్టాం. ఎందుకంటే జీవితంలో అత్యంత విలువైన కొన్ని పాఠాలు బల్ల ముందు కూర్చొని నేర్చుకోలేం. అవి ఆటస్థలంలోనే నేర్చుకుంటాం.

**క్రీడల వల్ల క్రమశిక్షణ అలవడుతుంది**

క్రీడలు కేవలం పతక విజేతలను మాత్రమే తయారుచేయవు. మంచి వ్యక్తిత్వం కలిగిన మనుషులను కూడా తీర్చిదిద్దుతాయి. విజయానికి ముందు క్రమశిక్షణను నేర్పుతాయి. విజయానికి ముందు ప్రత్యర్థుల పట్ల గౌరవాన్ని నేర్పుతాయి. విజయం తర్వాత వినయాన్ని నేర్పుతాయి. ఓటమి తర్వాత మళ్లీ లేచి నిలబడే ధైర్యాన్ని నేర్పుతాయి. అందుకే ప్రతి చిన్నారి తప్పకుండా ఒక క్రీడను ఆడాలి. ప్రతి చిన్నారి పతకం గెలిచినా, గెలవకపోయినా ఆత్మవిశ్వాసాన్ని మాత్రం తప్పకుండా గెలుచుకుంటారు.

**ఏపీ స్పోర్ట్స్ విజన్ సాకారంలో సింధు సహకారం కావాలి**

ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా రంగానికి సంబంధించి మా విజన్‌ను సాకారం చేయడంలో సింధు సహకారం ఎంతో అవసరం. మహిళల క్రీడాభివృద్ధి కోసం ఎలా ముందుకు సాగాలనే అంశంపై మేం ఇప్పటికే పనిచేస్తున్నాం. మరింత మంది బాలికలు, మహిళలు క్రీడల్లోకి రావాలంటే ఏం చేయాలనే దానిపై దృష్టి సారిస్తున్నాం. అది అంత సులభం కాదని తెలుసు. మీ తండ్రి వాలీబాల్ క్రీడాకారుడు కావడంతో మీ తల్లిదండ్రులు మిమ్మల్ని నమ్మి ప్రోత్సహించారు. కానీ ప్రతి బాలికకు అలాంటి ప్రోత్సాహం లభించదు. అందుకే, ముఖ్యంగా బాలికలు క్రీడల్లో రాణించేలా వారికి అనుకూలమైన వాతావరణం, స్పోర్ట్స్ ఎకోసిస్టమ్ నిర్మించడం అత్యంత అవసరం. ఆ మార్పునకు సింధు ఒక కీలక ప్రేరణగా ఒక్కరికి మాత్రమే కాదు, తరతరాల మహిళలకు స్ఫూర్తినిస్తూ, క్రీడలను కూడా ఒక గొప్ప వృత్తి అవకాశంగా చూడగలిగేలా వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. అందుకే, సమగ్ర క్రీడా విధానంతో పాటు బలమైన స్పోర్ట్స్ ఎకోసిస్టం నిర్మించడంలో మీతో కలిసి పనిచేయాలని ఎదురుచూస్తున్నాను.

**యువ క్రీడాకారులకు అవసరమైన సంపూర్ణ మద్దతు అందిస్తాం**

ఏపీ క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తాం. మీకు ఎప్పుడైనా, ఏ సహాయం అవసరమైనా మా తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి. శాప్ ఛైర్మన్ రవి నాయుడు విశ్వవిద్యాలయ రాజకీయాల నుంచి వచ్చినప్పటికీ, క్రీడల ప్రాముఖ్యతను, మా ముఖ్యమంత్రి దూరదృష్టిని బాగా అర్థం చేసుకున్నారు. అందువల్ల, మీకు అవసరమైన ప్రతి సహాయానికి మేం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం. ఏ చిన్నారి కూడా అవకాశం లేకపోవడం వల్ల తన ప్రతిభను కోల్పోకూడదని మేం బలంగా విశ్వసిస్తున్నాం. అందుకే మేం మీ వెన్నంటే ఉంటాం. ప్రపంచాన్ని జయించండి. ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలవండి. భారతదేశానికి కీర్తి తీసుకురండన్నారు.



# దేవరాపల్లిలో పట్టపగలే చోరీ – బంగారం, వెండి అపహరణ



**దేవరాపల్లి , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** మండల కేంద్రంలోని బందారు వీధిలో మంగళవారం సాయంత్రం గ్రామానికి చెందిన చొక్కాకుల ఎరుకునాయుడు, ఆయన భార్య దంపతులు పొలం పనులకు వెళ్లిన సమయం చూసి గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. 4 తులాల బంగారు ఆభరణాలు 20 తులాల వెండి ఆభరణాలు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం దాదాపు 4 లక్షల రూపాయల వరకు ఉండొచ్చని అంచనా బాధితులు బుధవారం దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. .కె.కోటపాడు సీఐ కృష్ణ, దేవరాపల్లి ఎస్ఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకున్నారు.క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో కలిసి ఇంట్లో వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు.చుట్టుపక్కల ఉన్న సీసీటీవీ ఫుటేజీని కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. పగటిపూట ఇళ్లలో ఎవరూ లేని సమయం చూసి టార్గెట్ చేయడం ఈ ముఠా పని తీరులా కనిపిస్తోంది.వరుసగా చోరీలు జరుగుతుండటంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి గస్తీ పెంచాలని కోరుతున్నారు.అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల గురించి సమాచారం ఉంటే 100 లేదా దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని పోలీసులు కోరారు. .ఇంటికి వెళ్లేటప్పుడు విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లో భద్రపరచుకోవడం, ఇరుగుపొరుగు వారికి చెప్పి వెళ్లడం మంచిదని పోలీసులు సూచించారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. దొంగల ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

# తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

**అనకావల్లి/ కోటవురట్ల , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం, రామచంద్రపురం , గూడువులోవ గ్రామంలో, అంగన్వాడి సెంటర్ వన్ పరిధిలో అంగన్వాడి సూపర్వైజర్ హైమావతి ఆధ్వర్యంలో తల్లి పాలు వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హేమవతి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని పిల్లలకు తల్లిపాలు కనీసం రెండు సంవత్సరాలు ఇవ్వగలిగితే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని, తల్లిపాల ద్వారా పిల్లలు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలియజేశారు ,బాలింతలు పౌష్టికాహారం సంపూర్ణంగా తీసుకోవాలని తెలిపారు. దీనిలో భాగంగానే జిల్లా బాలల సంరక్షణ విభాగం,




సామాజిక కార్యకర్త సోషల్ వర్కర్ ఏ రూప ప్రత్యేక శిశు దత్తత పై అవగాహన కల్పిస్తూ దత్తత ప్రక్రియ గురించి మరియు తల్లి తండ్రులు కోల్పోయిన పిల్లలు, వదిలి వేయబడిన పిల్లలు మరియు తల్లి దండ్రులు ద్వారా అప్పగించబడిన పిల్లలు ఎక్కడైనా కనిపించిన వారిని నేరుగా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలో గల ప్రత్యేక దత్తత విభాగానికి అప్పగించమని అవగాహన కల్పించడం జరిగినది. అంతే కాకుండా ఈ శాఖ ద్వారా రక్త సంబంధీకుల దత్తత మరియు స్టెప్ అడాప్షన్ చేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త నూక రత్నం, చిన్నమ్మలు,అంగన్వాడి సహాయకురాలు ,గర్భిణీలు, బాలింతలు,ప్రజలు పాల్గొన్నారు.


# శ్రీరాంపురంలో తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహనా కార్యక్రమం



**పాయకరావుపేట , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని శ్రీరాంపురంలో తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలింతల సందర్శన, ర్యాలీ చేపట్టి కొత్త గర్భిణీలను నవోదు చేశారు. శిశువు జన్మించిన తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. శిశువు కోరిన ప్రతిసారీ తల్లిపాలు అందించాలని, పుట్టిన అరగంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని వివరించారు. ముఖ్యంగా ముర్రుపాలు (కొలస్ట్రం) ఇవ్వడం వల్ల శిశువుకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తులసి నవీన, ఇఓ, హెచ్ఎస్, హెచ్వి, ఎఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్లిలోవ నగరవణం పర్యాటకులకు మరింత ఆకర్షణగా

**గొలుగొండ , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** గొలుగొండ మండలం ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నగరవణం పర్యాటకులను ఆకర్షించేలా అటవీ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టింది. సుమారు రూ.10 లక్షల వ్యయంతో పర్యాటకుల సౌకర్యార్థం షెడ్, బోరు, అంతర్గత రహదారి వంటి మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. అలాగే సందర్శకులు విశ్రాంతి తీసుకునేందుకు



బెంచీలు ఏర్పాటు చేయడంతో రోజురోజుకు నగరవణానికి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. నర్సీపట్నం అటవీ శాఖ రేంజర్ రాజేష్ ఆధ్వర్యంలో సిబ్బంది నగరవణాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిశుభ్రత, భద్రత, నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రకృతి ఒడిలో ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదించేందుకు ఈ నగరవణం స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు కూడా ఆకర్షణీయ కేంద్రంగా మారుతోంది.

# జీ.మాడుగుల ఏంపిపి, సిఎహెచ్ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ

**ఎ ఎస్ ఆర్ జిల్లా పాడేరు , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** అల్లూరి జిల్లా, జీ.మాడుగుల మండలంలోని సీఏహెచ్ బాలుర ఉన్నత పాఠశాల, బంధవీధి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను జిల్లా జాయింట్ కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడారు. తనిఖీలోని భాగంగా విద్యాబోధన ఒ ఆరోగ్యం, విద్యార్థుల చదువు తీరుపై, వారి ఆరోగ్య పరిస్థితులపై స్వయంగా పిల్లలను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడకుండా నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయుల సమయపాలన, పాఠశాల పనితీరు, అర్థమయ్యే రీతిలో విద్యా బోధన, ఉపాధ్యాయులు సమయానికి వస్తున్నారా లేదా అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఫేషియల్ అటెండెన్స్ పరిశీలన, అనంతరం ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించి 'ఫేషియల్ అటెండెన్స్' రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పిల్లకు రగ్గులు, బుక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అరట్లకోటలో శ్రీ లక్ష్మీ గణేష్ ఫైర్ వర్క్స్ షాపును తనిఖీ చేసిన సిఐ వినోద్ బాబు

**పాయకరావుపేట , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** మండలంలోని అరట్లకోటలో గల శ్రీ లక్ష్మీ గణేష్ ఫైర్ వర్క్స్ షాపును సిఐ ఎం వినోద్ బాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులోని రికార్డులను, గోడౌన్ లోని మందు గుండు సామాగ్రిని పరిశీలించి షాపు నిర్వాహకుడు కంభంపాటి వెంకట రమణకు తగు సూచనలు తెలియజేశారు. మందు గుండు సామాన్ల రక్షణ విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



ఎటువంటి ప్రమాదం జరుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జెర్రిపోతుల గోవిందరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏయూలో బోధన 'సంక్షోభం'!

**- అడ్హక్ట్, అడహాక్ అధ్యాపకుల అకారణ తొలగింపు**
**- నెల రోజులుగా నిలిచిన పాఠాలు..**
**ఖాళీ గదుల్లో 2,000 మంది విద్యార్థుల నిరీక్షణ**
**- పాత వారిని తీసేసి గంటల ప్రాతిపదికన కొత్తవారా?**
**- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులనూ లెక్కచేయని 'పాలక' వైఖరి**
**-' కోర్టుకు వెళ్తారా.. మీ విషయం చూసేదే లేదు':**
**అధ్యాపకులతో వీసీ తీవ్ర ఆగ్రహం, అవమానకర వ్యాఖ్యలు**
**- బాధితుల ఆవేదన..**
**ఉన్నతాధికారులపై కోర్టు ధిక్కరణ పిటిషన్‌కు సిద్ధం**

**విశాఖపట్నం , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** ఉత్తరాంధ్ర విద్యా నిలయంగా, దేశంలోనే విశేష ఖ్యాతి గడించిన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో (ఏయూ) ప్రస్తుతం తీవ్ర 'బోధన సంక్షోభం' నెలకొంది. గత రెండు దశాబ్దాలుగా శాశ్వత అధ్యాపకుల నియామకాలు లేక అల్లాడుతున్న వర్సిటీలో, ఉన్న తాత్కాలిక బోధకులను అకారణంగా విధుల్లోంచి తొలగించడంతో విద్యా వ్యవస్థ ఒక్కసారిగా స్తంభించిపోయింది. రూల్స్ ప్రకారం నియామకమై, వర్సిటీకి ఏటా రూ.60 కోట్లకు పైగా ఆదాయం తెచ్చిపెడుతున్న అడ్జంక్ట్, అడహాక్ అధ్యాపకులను పక్కనబెట్టడం.. వారి స్థానంలో గంటల వారీ వేతన ప్రాతిపదికన కొత్తవారిని తెచ్చేందుకు ప్రయత్నించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు స్పష్టమైన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినా అధికారులు కాలయాపన చేయడం, సదరు ఉత్తర్వులను సైతం ఖాతరు చేయకపోవడం అధ్యాపక, విద్యార్థి లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.

**నాక్ ర్యాంకింగ్ కోసం తెచ్చి.. ఇప్పుడు నడిరోడ్డున పడేసి!**

గతంలో ఏయూలో తీవ్ర అధ్యాపకుల కొరత వేధిస్తున్న సమయంలో, నాక్ ప్రమాణాలను కాపాడుకునేందుకు, విద్యార్థులకు బోధనా లోపం లేకుండా చూసేందుకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) ఆమోదంతో 2022, 2023లలో అడ్జంక్ట్, అడహాక్ అధ్యాపకులను నియమించారు. యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణంగానే నోటిఫికేషన్లు, ఇంటర్వ్యూల ద్వారా పారదర్శకంగా వీరందరినీ ఎంపిక చేశారు. ఇంజినీరింగ్, లా, జియాలజీ, పర్యావరణ శాస్త్రం, స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ వంటి స్వయం ఆర్థిక (సెల్ఫ్ సపోర్ట్) కోర్సులకు వీరే ప్రధాన బోధకులుగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యేక నిధులు లేకున్నా, సాధారణ సిబ్బంది జీతాలతో సంబంధం లేకుండా.. వీరు నిర్వహించే కోర్సుల నుంచి వచ్చే ఆదాయంతోనే వీరికి వేతనాలు చెల్లిస్తున్నారు. రెగ్యులర్ ప్రొఫెసర్ల లాగా వీరికి రీసెర్చ్ ఫండ్లు గానీ, కాన్ఫరెన్స్ అలవెన్సులు గానీ ఉండవు. అయినా విద్యార్థుల భవిష్యత్తు కోసం మూడేళ్లకు పైగా నిబద్ధతతో పనిచేసిన సుమారు 25 మందికి పైగా అధ్యాపకులను ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా విశ్వవిద్యాలయం ఉన్నపళంగా పక్కనబెట్టింది.

**ఒకరికి రెన్యూవల్.. మరొకరిపై కక్ష సాధింపా?**

ఇటీవల కాంట్రాక్ట్ అధ్యాపకులకు విధుల రెన్యూవల్ ఇచ్చిన వర్సిటీ యాజమాన్యం, సుమారు 40 మంది వరకు ఉన్న అడహాక్, అడ్జంక్ట్ అధ్యాపకులకు మాత్రం రెన్యూవల్ నిలిపివేసింది. ఉన్నతాధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోవడంతో బాధిత అధ్యాపకులు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు జూన్ 29న అడహాక్ అధ్యాపకులకు, జులై 31న అడ్జంక్ట్ అధ్యాపకులకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 'మనీష్ గుప్తా వర్సెస్ అదర్స్' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ప్రస్తావిస్తూ"ఒక కాంట్రాక్టు లేదా అడ్హాక్ ఉద్యోగి స్థానంలో మరో కాంట్రాక్టు/అడహాక్ ఉద్యోగిని భర్తీ చేయకూడదు. ఆ ఖాళీలను శాశ్వత పోస్టుల ద్వారా మాత్రమే నింపాలి" అని స్పష్టం చేస్తూ, వీరిని తక్షణమే విధుల్లో కొనసాగించాలని ఆదేశించింది. అయినప్పటికీ, వర్సిటీ యాజమాన్యంలో చలనం రాకపోవడంతో హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదేశాలను అమలు చేయకపోతే వర్సిటీ ఉన్నతాధికారులను నేరుగా కోర్టుకు పిలిపిస్తామని హెచ్చరించింది.

**'కోర్టుకు వెళ్తారా.. మీ కుటుంబాలు ఇబ్బంది పడితే పడనివ్వండి!'**

ఉపకులపతి వ్యాఖ్యలతో అధ్యాపకుల మనోవేదన న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో, తమ సమస్యను వివరించేందుకు బాధిత అధ్యాపకులు ఉపకులపతి (వీసీ)ని కలవడానికి వెళ్లారు. అయితే వారి విజ్ఞప్తిని వినకపోగా, వీసీ వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు అధ్యాపకులు తెలిపారు. మీరు కోర్టుకు వెళ్లినందున మీ విషయాన్ని పరిగణన లోకి తీసుకోవాలనే ఉద్దేశం నాకు లేదు. మిమ్మల్ని విశ్వవిద్యాలయంలో చేరమని ఎవరు చెప్పారు? మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు? మీ కుటుంబాలు ఇబ్బందులు పడితే పడనివ్వండి!" అని వీసీ వ్యాఖ్యానించినట్లు బాధిత అధ్యాపకులు వాపోయారు. అంతేకాకుండా, విజిలెన్స్ విభాగం జీతాలను తిరిగి వసూలు చేయాలని సూచిస్తోందని, నియామకమైన వారిలో ఎవరూ సరిగా బోధించలేరని నిందించినట్లు తెలిపారు. ప్రత్యేకించి షెడ్యూల్డ్ కులాలకు చెందిన అధ్యాపకులను పేరుపేరునా ప్రస్తావిస్తూ.. విక్టర్, విజయ్‌కుమార్ అనే ఇద్దరు అధ్యాపకులు పరిస్థితిని వివరించడానికి ప్రయత్నించగా, వారి మాటలను పట్టించుకోకుండా తీవ్రంగా అవమానించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విధిలేకనే తాము కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని చెప్పినా వినకుండా, అరిచి గొడవ చేయడం తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని వాపోయారు.

**2,000 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం!**

అధికారుల పంతాలు, పట్టింపుల వల్ల మూల్యం చెల్లించుకుంటోంది మాత్రం అమాయక విద్యార్థులే. గడిచిన నెల రోజులుగా సంబంధిత విభాగాల్లో బోధన పూర్తిగా స్తంభించిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి ఏయూ క్యాంపస్‌కు వస్తున్న సుమారు 2,000 మందికి పైగా విద్యార్థులు తరగతులు లేక ఖాళీ గదుల ముందు అటు ఇటు తిరుగుతూ కాలం వెళ్లదీస్తున్నారు. సిలబస్ పూర్తికాక, పరీక్షలు ఎప్పుడు జరుగుతాయో తెలియక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లాభాపేక్షతో నడుస్తున్న స్వయం ఆర్థిక కోర్సులను నిర్వీర్యం చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెడుతున్న ఏయూ అధికారుల తీరుపై ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని, హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం అధ్యాపకులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

**కోర్టు ధిక్కరణ పిటిషన్‌కు బాధితుల సన్నాహాలు**

హైకోర్టు జారీ చేసిన స్పష్టమైన మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయకపోగా నిరాదరణగా మాట్లాడడంపై తీవ్ర మనస్తాపానికి గురైన అధ్యాపకులు తదుపరి న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. విశ్వవిద్యాలయ అధికారుల తీరును, కోర్టు ఆదేశాల ఉల్లంఘనను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్తూ ఉన్నతాధికారులపై 'కాంటెంప్ట్ పిటిషన్' (కోర్టు ధిక్కరణ పిటిషన్) దాఖలు చేయాలని, అలాగే రాష్ట్ర గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష



**ముంచంగి పుట్టు , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు, ముంచంగి పుట్టు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి యు విమల కుమారి వారి ఆధ్వర్యంలో మండలంలో గల సి హెచ్ సి లో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ సి వైద్యాధికారిణి కే గీతాంజలి మాట్లాడుతూ 0నుండి 6 నెలల పిల్లలకు కేవలం తల్లిపాలే శ్రేయస్కరమని తెలియజేశారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి 7 తేదీ వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి విమల కుమారి తెలిపారు. శిశువుకు రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు తల్లి ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ప్రతి తల్లి, తల్లి పాల ప్రాముఖ్యతను పై అవగాహన కలిగి బిడ్డకు తప్పనిసరిగా తల్లి పాలను అందించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ రాజేశ్వరి,స్వర్ణ, కొండమ్మ,అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు మరియు అర్హులైన లబ్ధిదారులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో పరారీలో ఉన్న నిందితుడు అరెస్ట్

**భీమునిపట్నం , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** అటెంప్ట్ టు మర్డర్ కేసులో కోర్టు జారీ చేసిన నాన్ బెయిల్ బుల్ వారెంట్ (ఎన్ బి డబ్ల్యూ) కలిగి చాలా కాలంగా పరారీలో ఉన్న మామిడి సాయి దుర్గ ను బుధవారం భీమిలి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి ఆచూకీ కోసం సాంకేతిక సమాచారం ఆధారంగా భీమిలి సి.ఐ దివాకర్ యాదవ్ మరియు వారి బృందానికి విజయనగరం జిల్లా, జమ్మూ నారాయణ పురం లో నిందితుడు పట్టుబడగా అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచేందుకు తదుపరి చర్యలు తీసుకుంటున్నామని సి.ఐ తెలిపారు. కోర్టు ఆదేశాలను గౌరవించని వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని ఈ సందర్భంగా సీఐ దివాకర్ యాదవ్ హెచ్చరించారు.




# ఘనంగా టిడిపి అధ్యక్షులు గొలగాని నరేంద్ర జన్మదిన వేడుకలు



**భీమునిపట్నం , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** భీమిలి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ మరియు భీమిలి జీవీఎంసీ మూడో వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ యాదవ్ కమ్యూనిటీ యువ నాయకులు, విశాఖపట్నం జిల్లా మాజీ ప్లానింగ్ కమిటీ సభ్యులు గొలగాని నరేంద్ర కుమార్ 45 వ జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే గంటా కార్యాలయంలో వార్డు ప్రధాన కార్యదర్శి కనకల అప్పలనాయుడు, కోశాధికారి కంచర్ల కామేష్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి గంటా నూకరాజు, 2 వ వార్డు మాజీ కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, బిజెపి నాయకురాలు కే. సునీత తదితరులు పాల్గొని నరేంద్ర గొప్పతనాన్ని, పార్టీ కి చేసిన కృషిని కొనియాడారు. అనంతరం పార్టీ నాయకులు, అభిమానులు గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసారు. అనంతరం భీమిలి జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు 55 మందికి నరేంద్ర కుమార్ చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. అంతకుముందు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు స్వగృహం లో గొలగాని నరేంద్ర కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాగవంశం సంక్షేమం వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరే షన్ డైరెక్టర్ గాడు సన్యాసి నాయుడు, భీమిలి నూకాల మ్మ అమ్మవారి ట్రస్ట్ చైర్మన్ చురకల రమణ, విశాఖ జిల్లా బిజెపి కార్యదర్శి కంటూ బుక్త సునీత, శ్రీ శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం ట్రస్ట్ సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్త లు,వివిధ సంఘాల ప్రతి నిధులు, నాయకులు పాల్గొని నరేంద్ర కు జన్మదిన శు భాకాంక్షలు తెలియ చేసారు.

# ప్రజా యుద్ధనౌక గద్దర్ 3వ వర్ధంతి కార్యక్రమం నేడు



**దేవరాపల్లి , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** ప్రజా కవి, తెలంగాణ ఉద్యమ గాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ మూడవ వర్ధంతి కార్యక్రమం మండల కేంద్రం దేవరాపల్లిలో ఘనంగా నిర్వహించనున్నట్లు అంబేద్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షులు కాటపల్లి అప్పారావు తెలిపారు .ఆగస్టు 6, గురువారం ఉదయం 10 గంటలకు అంబేద్కర్ కాలనీ దేవరాపల్లిలోని కళా వేదిక వద్ద జరిగే కార్యక్రమంలో పాటల తూటా ఆతవ ఉదయభాస్కర్ గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించడం గద్దర్ పాడిన విప్లవ గీతాలు, జానపదాలను స్థానిక కళాకారులు ఆలపిస్తారన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, దళిత-బహుజన ఉద్యమాలపై వక్తల ప్రసంగాలు గద్దర్ అన్న జీవితం, పోరాట స్ఫూర్తిని కొత్త తరానికి తెలియజేయడం గద్దర్ అన్న అసలు పేరు గుమ్మడి విత్తల్ రావు. ఆయన తన పాటలతో, కవితలతో ప్రజల కష్టాలను ప్రపంచానికి చాటి చెప్పారు. భూపోరా టాలు, కార్మికుల హక్కులు, కులవివక్షకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం నేటికీ యువతకు స్ఫూర్తి. "అమ్మా తెలంగాణ" నుంచి "పోరాడు తెలంగాణ" వరకు ఆయన పాట ప్రతి ఉద్యమానికి ఊపిరి పోసింది. అంబేద్కర్ ఆశయ సాధన సంఘం, మండల కమిటీ సభ్యులు ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు, యువత, అభిమానులు అందరూ ఈ నివాళి కార్యక్రమంలో పాల్గొని గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కాటపల్లి అప్పారావు కోరారు.

# మాడుగులలో ఆగస్టు 6న భారీ రిలే నిరాహార దీక్ష

### డిఎస్సి అవకతవకలపై సిబిఐ విచారణ, నిరుద్యోగ భృతి బకాయిలు చెల్లించాలని వైసీపీ డిమాండ్



**దేవరాపల్లి , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** మాడుగుల నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన గళం మిన్నంటనుంది.ఆగస్టు 6, 2026 గురువారం ఉదయం 9:00 గంటలకు మాడుగుల మండలం, మాడుగుల గ్రామంలోని ఆర్టీసీ బస్సు స్టాండ్ వద్ద ఈ కార్యక్రమం జరగనుంది.రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన డిఎస్సి ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవకతవకలపై సిబిఐ దర్యాప్తు జరపాలి.రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి.కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి 26 నెలల బకాయిలను తక్షణమే చెల్లించాలి.ఆగస్టు 6, 7, 8, 9 తేదీల పాటు డిఎస్సి బాధితులు, నిరుద్యోగులు చేపట్టనున్న రిలే నిరాహార దీక్షకు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ దీక్షకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఉత్తరాంధ్ర జిల్లాల జోన్-1 వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లే అనురాధ విచ్చేయనున్నారు.దేవరాపల్లి మండల పరిషత్ ఉపాధ్యక్షులు, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, మాజీ రాష్ట్ర వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కో-ఆపరేటివ్ అధ్యక్షులు, అన్ని గ్రామాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అన్ని విభాగాల కమిటీ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, పత్రికా విలేకరులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు.నిరుద్యోగ సమస్యలపై, విద్యార్థి భవిష్యత్తుపై ప్రభుత్వం స్పందించేలా ఒత్తిడి తేవడమే ఈ దీక్ష ముఖ్య ఉద్దేశ్యమని వారు తెలిపారు.ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలని వైసీపీ నాయకులు పిలుపునిచ్చారు.

# అడ్జంక్ట్, అడ్ హాక్ అధ్యాపకులను తొలగించడం దారుణం

**విశాఖపట్నం , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** విశ్వవిద్యాలయంలో మూడు సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్న సుమారు 25 మంది అడ్జంక్ట్ మరియు అడ్‌హాక్ అధ్యాపకులను ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా విధుల నుంచి తొలగించారు. వారి స్థానంలో గంటల వారీ వేతన ప్రాతి పదికన తాత్కాలిక అధ్యాప కులను నియమించ డానికి విశ్వవిద్యాలయం ప్రయత్ని స్తోంది.దీంతో బాధిత అధ్యాపకులు న్యాయ స్థానాన్ని ఆశ్రయించగా, న్యాయ స్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అనం తరం, అధ్యాపకుల ందరూ తమ సమస్యలను వివరించే దుకు బుధవారం ఉపకులపతిని కలిసి తమ విజ్ఞప్తిని తెలియజేయ డానికి వెళ్లారు.అయితే, ఉపకులపతి వారి పట్ల ఆగ్రహంతో ప్రవర్తిస్తూ, "మీరు కోర్టుకు వెళ్లినందున మీ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలనే ఉద్దేశం నాకు లేదని పేర్కొన్నట్లు అధ్యాపకులు తెలిపారు. దీనికి ప్రతిగా, పలుమార్లు కలిసేందుకు ప్రయత్నించినప్పటికీ అవకాశం కల్పించకపోవడం వల్లనే తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని అధ్యాపకులు వివరిం చారు.అదనంగా, విజిలెన్స్ విభాగం వారి జీతాలను తిరిగి వసూలు చేయాలని సూచిస్తున్నదని, వారిలో ఎవరూ సరిగా బోధించలేరని ఉపకులపతి వ్యాఖ్యా నించినట్లు వారు తెలిపారు. అంతేకాకుండా, వారిపై గట్టిగా అరుస్తూ, అవమానకరంగా



ప్రవర్తించినట్లు ఆరోపించారు.ముఖ్యంగా, షెడ్యూల్డ్ కులాలకు చెందిన కొంతమంది అధ్యాపకులను పేరుపేరునా ప్రస్తావిస్తూ, విక్టర్ మరియు విజయ్‌కుమార్ అనే ఇద్దరు అధ్యాపకులు పరిస్థితిని వివరించడానికి ప్రయత్నించినప్పుడు, వారి మాటలను పట్టించుకోకుండా, వారిని అవమానపరిచే విధంగా ప్రవర్తించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, "మీ కుటుంబాలు ఇబ్బందులు పడితే పడనివ్వండి", "మిమ్మల్ని విశ్వవిద్యాలయంలో చేరమని ఎవరు చెప్పారు?", "మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు?" వంటి వ్యాఖ్యలు చేసినట్లు కూడా వారు తెలిపారు.ఈ వ్యాఖ్యలు అధ్యాపకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా, వారిలో తీవ్ర మనోవేదనను కలిగించాయని వారు పేర్కొన్నారు. న్యాయస్థానం జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా ఈ విధంగా ప్రవర్తించడం సముచితం కాదని వారు అభిప్రాయపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన అధ్యాపకులు, ఈ వ్యవహారాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లి, ధిక్కార పిటిషన్ (కాంటెంప్ట్ పిటిషన్) దాఖలు చేయాలని నిర్ణయించారు.

# ఆగస్టు 11 న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు : జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి

**విశాఖపట్టణం , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ అధ్యక్షతన ఈనెల 11 వ తేదీ ( మంగళవారం) ఉదయం 10-00 గంటల నుండి మధ్యాహ్నం వరకు జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఛైర్ పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆమె ఛాంబర్ సమీపంలోని వి.సి.హాలులో మరియు జడ్పీ సమావేశ మందిరంలో 1 నుంచి 7 వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10:00 నుంచి 12:00గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. 2, 3 మరియు 6వ స్థాయీ సంఘ సమావేశం ఉదయం 10:00 గంటలకు, 4వ స్థాయి సంఘ సమావేశం11:00, 5వ స్థాయి సంఘ సమావేశం11:30 గంటలకు, 1,7వ స్థాయి సంఘ సమావేశములు 12:00 జరుగుతాయని వివరించారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు, సంబంధించిన ప్రగతి నివేదికలతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని ప్రకటన ద్వారా కోరారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం : హెచ్ ఏ వెంకటేష్




**అనకాపల్లి / నర్సీపట్నం , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఆరోగ్య కార్యకర్త వెంకటేష్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.నర్సీపట్నం మండలం, కొత్త బైయాపిరెడ్డిపాలెం, పాత బైయాపిరెడ్డిపాలెం గ్రామలలో, అంగన్వాడి సెంటర్ పరిధిలో అంగన్వాడి హెల్త్ డిపార్ట్మెంట్ హెచ్ ఏ వెంకటేష్ ,ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని పిల్లలకు తల్లిపాలు కనీసం రెండు సంవత్సరాలు ఇవ్వగలిగితే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని, తల్లిపాల ద్వారా పిల్లలు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలియజేశారు,బాలింతలు పౌష్టికాహారం సంపూర్ణంగా తీసుకోవాలని తెలియజేయడం జరిగినది. దీనిలో భాగంగానే జిల్లా బాలల సంరక్షణ విభాగం, సామాజిక కార్యకర్త సోషల్ వర్కర్ ఏ. రూప ప్రత్యేక శిశు దత్తత పై అవగాహన కల్పిస్తూ దత్తత ప్రక్రియ గురించి మరియు తల్లి తండ్రులు కోల్పోయిన పిల్లలు, వదిలి వేయబడిన పిల్లలు మరియు తల్లి దండ్రులు ద్వారా అప్పగించబడిన పిల్లలు ఎక్కడైనా కనిపించిన వారిని నేరుగా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలో గల ప్రత్యేక దత్తత విభాగానికి అప్పగించమని అవగాహన కల్పించారు. అంతే కాకుండా ఈ శాఖ ద్వారా రక్త సంబంధీకుల దత్తత మరియు స్టెప్ అడాప్షన్ చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలోఎం ఎస్ కె భవాని,అంగన్వాడి కార్యకర్తలు ఎన్ .మహేశ్వరి,వి కృష్ణకుమారి వి. సత్యవతి, కె. రాజేశ్వరి, ఎన్. పద్మ,అంగన్వాడి సహాయకురాలు కే. నాగ భూలక్ష్మి, పి.వరలక్ష్మి ఆశ వర్కర్లు ఎం. లక్ష్మి , బి. లక్ష్మి,గర్భిణీలు, బాలింతలు,ప్రజలు పాల్గొన్నారు.

# భూమి సర్వే నెంబర్లను మార్చేసిన గనులు..!??

## అడిగితే నిర్లక్ష్యపు సమాధానాలు..!?





**అనకాపల్లి / చీడికాడ , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** భూ యజమానులు మారుతారు వాహన యజమానులు మారుతారు. భూములకు సర్వే నెంబర్లు ఉంటాయి. వాహనాలు తయారైనప్పుడు శాసి నంబర్లు ఉంటాయి. బండి పనికి రాకుండా పోయే వరకు అదే నెంబర్ ఉంటుంది. అలానే భూమి తాలూకా సర్వే నంబర్ నాటి నుండి నేటి వరకు తరతరాలుగా ఒకటే నెంబర్ ఉంటుంది. అన్నది జగమెరిగిన సత్యం. ఖాతా నెంబర్ పట్టా నెంబర్ మారవచ్చు కానీ సర్వేనెంబర్ అన్నది మారదు అన్నది రాజ్యాంగపరంగా రెవెన్యూ చట్టం పరంగా ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే. కానీ సర్వే నెంబర్లను మార్చేసిన గనులు సైతం రెవెన్యూ శాఖలో ఉన్నారంటే ఆశ్చర్యపోక తప్పదు. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం లోని వీరభద్రుని పేట గ్రామంలో కొల్లి వరలక్ష్మి 2000లో భూమి కొనుగోలు చేశారు. డాక్యుమెంట్లలో పాసుపుస్తకం లో వన్ బి లో అవే సర్వే నెంబర్లు ఉన్నాయి. 26 సంవత్సరాల అనంతరం ఆ సర్వే నెంబర్లను సర్వేయర్ వీఆర్వో మార్చేశారు. అదే మన అడిగితే మీకు పాత సర్వేనెంబర్ కావాలా కొత్త సర్వే నంబర్లు కావాలా అని సమాధానం ఇస్తున్నారే కానీ సమస్యను పరిష్కరించే దిశలో లేరని బాధితురాలు కొల్లి వరలక్ష్మి విలేకరుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. 2024 9వ నెలలో వరలక్ష్మి మ్యాటెషన్ పెట్టుకున్నారు.. అప్పట్లో ఉన్న విఆర్ఓ, ఆర్ ఐ, డి టి సదరు పేరు మీద ఉన్న సైట్ ను క్లోజ్ చేశారు. అది నేటికీ ఓపెన్ కావడం లేదు. బాధితురాలు ఆధార్ నెంబర్ కుట్టిన అనేక రకాలుగా ప్రయత్నించిన ఆ సైట్ ఓపెన్ కావడం లేదంటే అధికారులు ఏ విధంగా దానిని బ్లాక్ చేశారో ఇట్టే అర్థమవుతుంది. ఈ సర్వే నెంబర్లను వేరొకరి పేరు మీద ట్రాన్స్ఫర్ చేసి, వేరే సర్వే నంబర్లు ఈమెకు ఇచ్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటివరకు ఎక్కడ జరగని విధంగా సర్వే నెంబర్లు మారిపోవడం చూస్తుంటే పరిస్థితి రెవెన్యూ శాఖలో ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఆ సర్వే నెంబర్లో గల భూమి యజమానులు మారవచ్చు సాగుదారులు మారవచ్చు పట్టా నెంబరు ఖాతా నెంబర్ మారవచ్చు కానీ సర్వే నెంబరు మారే అంశం చరిత్రలో ఎక్కడ చూసినా కనిపించడం లేదు. ఈ సమస్యపై బాధితురాలు ప్రస్తుత విఆర్వో సచివాలయ సర్వేయర్ వద్దకు వెళ్తే మీకు పాత సర్వే నెంబర్లతో.కావాలా లేక కొత్త సర్వే నెంబర్లతో కావాలా అని ప్రశ్నిస్తున్నారని. వీఆర్వోకి సహాయకుడిగా ఉన్న రమణ అనే వ్యక్తి పాత నెంబర్లతోనే ఇస్తే కత్తులు గొడ్డలి పట్టుకుని నరుకుని చస్తారు పాత నెంబర్లు వద్దు కొత్త నెంబర్లు ఇస్తాం అని చెప్పడంలో ఆంతర్యం అంత చిక్కడం లేదు. ఆ భూములపై సాగులో ఉ ఒడి సర్వహక్కులు కలిగిన వ్యక్తుల పేర్ల మీద ఉన్న నెంబర్లను తప్పించి వేరే నెంబర్లు ఇవ్వడం, అదే కాకుండా వీఆర్వోకు అసిస్టెంట్ గా పని చేస్తున్న రమణ అతిగా ప్రవర్తించి ఆ నెంబర్లతో మీకు దోపత్రాలు ఇస్తే గొడవలు అవుతాయని చెప్పడం వెనుక అంతర్యం అంత చిక్కడం లేదు. వాస్తవంగా రెవెన్యూ శాఖలో క్షేత్రస్థాయిలో వీఆర్ఏ, వీఆర్వో, అనంతరం ఆర్ఐ, డిప్యూటీ తహసిల్దార్, తహసిల్దార్ ల ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం అయినా జరుగుతుంది, కానీ వీఆర్వోల సహాయకులు, చక్రం తిప్పడం వెనక ఆంతర్యం అంత శిఖరం లేదు. వీరికి అధికార పరంగా బాధ్యతలు స్వీకరించినట్లు వ్యవహరించడమే కాకుండా ప్రజల నుండి ముక్కుపిండి సొమ్ము వసూలు చేసి పనులు చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. ప్రభుత్వం థర్డ్ పార్టీ లేకుండా కార్యకర్తలు జరగాలని ఆదేశాలు జారీ చేస్తుంటే క్షేత్రస్థాయిలో ఉద్యోగులు తమ సహాయకులుగా నియమించుకున్న వ్యక్తులే చక్రం తిప్పడం వెనుక ఆంతర్యం అంత చిక్కడం లేదు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా లేక అక్రమార్కులకు సహకరిస్తారా అన్నది వేచి చూడాల్సిందే.

# కూనవరం మండలంలోని అన్ని సచివాలయాల్లో విఆర్వో లు, సిబ్బందిని తక్షణమే నియమించాలి : సిపిఎం పార్టీ డిమాండ్

- సచివాలయాల్లో సిబ్బంది కొరత.. ప్రజా సేవలకు ఆటంకం ప్రభుత్వం వెంటనే స్పందించాలి
- విఆర్వో ల కొరతతో ప్రజలకు ఇబ్బందులు తక్షణమే నియామకాలు చేపట్టాలి

**కూనవరం , ఆగస్టు . 05 ( మనం న్యూస్ ) :** పోలవరం జిల్లా కూనవరం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ పోస్టులతో పాటు ఇతర ఖాళీ సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ, కూనవరం మండలంలో మొత్తం 11 గ్రామ సచివాలయాలు ఉండగా, ప్రతి సచివాలయానికి ఒక్కో విఆర్వో చొప్పున 11 మంది విఆర్వో లు అవసరమని, ప్రస్తుతం కేవలం 5 మంది విఆర్వో లతోనే మొత్తం మండలాన్ని నిర్వహించడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. గతంలో 16 పంచాయతీలకు 16 మంది రెవెన్యూ సిబ్బంది విధులు నిర్వహించేవారని, సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో 16 పంచాయతీలను 11 సచివాలయాలుగా మార్చినప్పటికీ అవసరమైన సిబ్బందిని ప్రభుత్వం నియమించకపోవడం వల్ల రెవెన్యూ సేవలు దెబ్బతిన్నాయని విమర్శించారు. ప్రస్తుతం ఒక్కో ఎ=ాకి రెండు నుంచి మూడు సచివాలయాల బాధ్యతలు అప్పగించడంతో ప్రజలకు అవసరమైన సమయంలో అధికారులు అందుబాటులో ఉండడం లేదని, ధ్రువపత్రాలు, భూ సంబంధిత సేవలు, రెవెన్యూ సమస్యల పరిష్కారం ఆలస్యమవుతోందని అన్నారు. అదనపు బాధ్యతల కారణంగా విఆర్వో లు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఒకవైపు ఓటర్ వెరిఫికేషన్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ర్వేలో బీఎల్వో అధికారులుగా విఆర్వో లనే నియమించగా, మరోవైపు



సచివాలయాల పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యతలను కూడా వారిపైనే మోపడం వల్ల విధుల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ముంపు మండలాలపై కపట ప్రేమ చూపిస్తూ, ఏజెన్సీ ప్రాంతాలపై వివక్ష చూపడం తగదన్నారు. అలాగే గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహించాల్సిన సిబ్బందిని కూడా పోలవరం ప్రాజెక్టు సర్వేలు, ఐటీడీఏ కార్యాలయ పనులకు వినియోగించడం వల్ల గ్రామస్థాయిలో ప్రజా సేవలు మరింత దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల కూనవరం మండలంలోని అన్ని సచివాలయాల్లో వెంటనే వీఆర్వో పోస్టులను భర్తీ చేయడంతో పాటు అన్ని కాళీ సిబ్బంది పోస్టులను నియమించారని ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది ఈ సమావేశంలో మండల కార్యదర్శి బాబు బొర్రయ్య మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాసరావు తెల్లం తమ్మయ్య వియిక కన్నయ్య తొండా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

# మంచం పట్టిన గోవాడ బి.సి. బాలుర వసతి గృహం!?

**- గోవాడ వసతి గృహంలో మెనూ సక్రమంగా లేదంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు!??,**

**- రాష్ట్ర ఆహార కమీషన్ తనిఖీలు జరిపిన 24 గంటలు గడవక ముందే ఆరోపణలు !?**



**అనకాపల్లి / చోడవరం , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని గోవాడ బి.సి. ప్రభుత్వ వసతి గ్రహంలో విద్యార్థులకు అందించాల్సిన మెనూ సక్రమంగా అమలు చేయకపోవడంతో విద్యార్దులు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారని తల్లి తండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థలకు అందించే పౌస్టికాహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సహించేది లేదని రాష్ట్ర ఆహార కమీషన్ సభ్యుడు ఈ లక్ష్మీరెడ్డి హెచ్చరించి, 24 గంటలు గడవక ముందే ఆహార లేమి తో 8 వ తరగతి విద్యార్ది పండ శివ కుమార్ అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యాడు. జాతీయ ఆహార భద్రత చట్టం 2013 ప్రకారం ప్రతీ లబ్ధిదారుడికి నాణ్యమైన ఆహారాన్ని అందించేలా అధికారులు భాధ్యత తీసుకోవాలన్నారు.

వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే మెనూ సక్రమంగా అమలు చేయని అధికారులు పై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లి తండ్రులు, ప్రజా సంఘాలు వారు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులకు అందాల్సిన పౌష్టికాహారం పక్కతోవ పడుతోందని పేరెంట్స్ కమిటీ ఆరోపిస్తోంది. మూడు వసతిగృహాలకు ఒకరే సంక్షేమాధికారి కావడంతో, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో కూడా తెలియదని స్థానికులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థి అనారోగ్యానికి కారణమైన గోవాడ బిసి వసతి గృహ సంక్షేమ అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



# డ్రగ్స్ వద్దు బ్రో"తో విద్యార్థుల్లో చైతన్యం

**- ఈగల్ పల్లెబాట కార్యక్రమంలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన**

**- 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఈగల్ అధికారుల పిలుపు**

**- విద్యార్థి దశ నుంచే మత్తు వ్యసనాలపై అప్రమత్తత అవసరమని ప్రిన్సిపాల్ రమేష్‌బాబు**

**- ఈగల్ పల్లెబాట కార్యక్రమంలో ఆపరేషన్ చైతన్యం, గరుడపై వివరాలు**

**- సురక్షిత క్యాంపస్ -- మత్తు రహిత సమాజమే లక్ష్యమని అధికారుల సందేశం**

**- డ్రగ్స్‌కు ‘నో’ చెప్పి మంచి భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపు**

**- యువతను మత్తు వ్యసనాల బారిన పడకుండా చైతన్యపరిచిన ఈగల్ బృందం**

**పోలవరం జిల్లా (చింతూరు , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర పోలీసు శాఖ చేపట్టిన ఈగల్ పల్లెబాట కార్యక్రమంలో భాగంగా, ఐజీపీ ఆకే రవికృష్ణ, ఐపీఎస్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలవరం జిల్లా ఈగల్ విభాగం, తూర్పుగోదావరి జిల్లా ఈగల్ బృందం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆపరేషన్ చైతన్యం, ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ ఈగల్ ఆన్ ట్రైన్స్, సేఫ్ క్యాంపస్ జోన్, వజ్ర ప్రహార్ తదితర కార్యక్రమాల లక్ష్యాలను అధికారులు వివరించారు.



ముఖ్యంగా గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈగల్ పోలవరం జిల్లా ఇన్‌స్పెక్టర్ పి.వి. సూర్యమోహన్‌రావు, హెడ్ కానిస్టేబుళు మధు, వీరబాబు, వెంకటేష్ పాల్గొని విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి మాదకద్రవ్యాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. రమేష్‌బాబు మాట్లాడుతూ, “విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. యవ్వనంలో చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చదువు, క్రమశిక్షణ, మంచి లక్ష్యాలతో ముందుకు సాగితేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుంది” అని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భరత్, గణేష్, దుర్గాప్రసాద్, భూలక్ష్మి, అప్పలనాయుడు, సుశీల, రాము, శివ, చంద్రశేఖర్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రతిష్టాత్మక వీఎంఆర్డీఏ ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

**అనకాపల్లి , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి పట్టణాన్ని ఆధునిక మౌలిక వసతులతో కూడిన అభివృద్ధి నగరంగా తీర్చిదిద్దేందుకు వీఎంఆర్డీఏ చేపడుతున్న ప్రతిష్టాత్మక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, విశ్రాంతి వేదికలు, పచ్చదనం కలిగిన పట్టణ వాతావరణాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బుధవారం కొడూరు మాస్టర్ ప్లాన్ రోడ్డు, కొత్తూరు సిటీ లెవల్ పార్కు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముందుగా కొడూరు ప్రాంతంలో వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో రూ. 9.68 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను కలెక్టర్ పరిశీలించారు. సుమారు 2.1 కిలోమీటర్ల పొడవు, 30 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న ఈ రహదారి అనకాపల్లి పట్టణ అభివృద్ధికి కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రహదారి నిర్మాణం, బీటీ రోడ్డు పనులు, ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ వ్యవస్థ, నాలుగు కల్వర్టుల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. మిగిలిన సివిల్ పనులను వేగవంతం చేసి నాణ్యత ప్రమాణాల్లో ఎలాంటి రాజీ లేకుండా ఆగస్టు 2026 చివరి నాటికి పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ రహదారి పూర్తయితే పట్టణ ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు పరిశ్రమలు, విద్యాసంస్థలు, నివాస ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం ఏర్పడి స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం కొత్తూరు ప్రాంతంలో వీఎంఆర్డీఏ రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో 5.38 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న సిటీ లెవల్ పార్కును పరిశీలించారు. పార్కులో ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్‌లు, చిన్నారుల ఆట స్థలాలు, పచ్చదనం, ల్యాండ్‌స్కేపింగ్, విశ్రాంతి ప్రాంతాలు, నీటి సరఫరా సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన



వాతావరణం కల్పించేలా పార్కును అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేసి నిర్ణీత గడువులో ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలు లో నాణ్యత, పారదర్శకత, వేగం అనే మూడు అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ రోజువారీ పర్యవేక్షణతో పూర్తి చేసి, నిర్ణయించిన గడువును తప్పకుండా పాటించాలని వీఎంఆర్డీఏ ఇంజినీరింగ్ బృందానికి సూచించారు. ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ సూపరింటెండింగ్ ఇంజనీర్, జిల్లా సమన్వయ అధికారి (డీసీఓ), ఆర్‌డీఓ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు పనుల పురోగతి, పెండింగ్ సివిల్ పనులు, సాంకేతిక అంశాలపై వివరాలు తెలియజేశారు.

### పార్టీ పల్స్ కార్యాలయంలో జర్నలిస్టులను మర్యాదపూర్వకంగా కలిసిన

# వెల్డింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ అసోసియేషన్ ప్రతినిధులు



**విశాఖపట్నం , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** వెల్డింగ్ రంగ అభివృద్ధి, నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం కల్పిస్తూ సేవలందిస్తున్న వెల్డింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం పార్టీ పల్స్ కార్యాలయంలో పలువురు సీనియర్ జర్నలిస్టులను మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కరణం కనకారావు, జనరల్ సెక్రటరీ చట్టి వెంకట రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అంజి బాబు, కార్యవర్గ సభ్యుడు ఆర్.టి. నాయుడు మీడియా ప్రతినిధులతో సమావేశమై సంఘం లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణపై వివరించారు. అధ్యక్షుడు కరణం కనకారావు మాట్లాడుతూ, సమాజానికి వాస్తవ సమాచారాన్ని చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, మీడియా ప్రతినిధులు తమ సంఘానికి ఎల్లప్పుడూ సన్నిహితులేనని పేర్కొన్నారు. వెల్డింగ్ రంగానికి సంబంధించిన అవగాహన కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా సహకారం ఎంతో అవసరమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు తిలక్ (మనం న్యూస్), బాషా (ఇన్నర్ వ్యూ), పవన్ (స్పై న్యూస్ ఎక్స్‌ప్రెస్), లిదివాకర్ (దళిత వాయిస్)లిలను అసోసియేషన్ ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సత్కరించి, వారి పాత్రను అభినందించారు. జర్నలిస్టులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వెల్డింగ్ రంగ అభివృద్ధి, నైపుణ్య శిక్షణకు సంబంధించిన ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు మీడియా తరఫున సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్డింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ అసోసియేషన్ సభ్యులు, శిక్షణా సంస్థల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు పిల్లలకు శ్రేయస్కారం : ఎమ్మెల్యే పల్లా



**గాజువాక , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** గాజువాక 66వ వార్డులో కనితి రోడ్డు ఇందిరా కాలనీ నందు గల అంగన్వాడి కేంద్రంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆగస్టు ఒకటో తేదీ నుండి ఏడవ తేదీ వరకు జరుగు తల్లిపాల వారోత్సవాలు తల్లిపాలతో బిడ్డకు రక్ష అనే కార్యక్రమం వాసవ్య మహిళా మండలి విప్రో కేర్ కుషాల్ మెటర్నిటీ మెంటల్ హెల్త్ ప్రాజెక్ట్ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి స్కూల్ నందు జరుగు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 66వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ మరియు మాజీ కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్ జనసేన వార్డు అధ్యక్షులు పోలారపుతూ వెంకటరమణ వార్డు అధ్యక్షులు గోమాడ వాసు అంగన్వాడీ సిడిపిఓ నేలవేణి ఇందిరా కాలనీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ దివ్య గౌతమి కుశల్ ప్రాజెక్టు ఉష పాల్గొన్నారు .ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మహమ్మద్ రఫీ మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు అత్యంత సురక్షితం శిశువుకు సంపూర్ణ పౌష్టికాహారం బిడ్డకు ముఖ్యంగా తల్లిపాలు ఇవ్వాలి అందువల్ల బిడ్డకు కావలసిన అన్ని పోషకాలు విటమిన్స్ మినరల్స్ ప్రోటీన్స్ లభిస్తాయని పసిపిల్లలకు అవి ఎంతో శ్రేష్టమైన మని తల్లిపాలు తాగితే పిల్లలు ఎంత బరువు ఉండాలో అంతే ఉంటారు అధిక బరువు అసలు బరువు లేకపోవడం వంటి సమస్యలు ఎక్కువగా రావు తల్లిపాలు తాగుతూ పెరిగే పిల్లలకు భవిష్యత్తులో డయాబెటిస్ ఒబెసిటీ సమస్యలు రాకుండా ఉంటాయి అని ప్రతి ఒక్క తల్లి కూడా తమ పిల్లలకు తల్లిపాలు ఇవ్వాలని మంచి ఆరోగ్యంగా పుష్కలంగా ఉండాలంటే పిల్లలకు తల్లిపాలు తప్పకుండా ఇవ్వాలని అన్నారు కూటమి ప్రభుత్వంలో అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టిక ఆహారం లో పోషకాలు విటమిన్స్ మినరల్స్ ప్రోటీన్స్ తల్లులకు పిల్లలకు అందిస్తుందని చెప్పారు ఈ కార్యక్రమంలో బాలింతలు మరియు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు చెరుకూరి నాగేశ్వరరావు గూడెపు సత్యనారాయణ లతా రమణ మరియు అంగన్వాడీ సూపర్వైజర్ చెల్లయ్యమ్మ అంగన్వాడీ టీచర్స్ టీ మంగమ్మ వరలక్ష్మి నాగలక్ష్మి ఏఎన్ఎంలు భవాని రమాదేవి వెంకటలక్ష్మి యూ పి హెచ్ సి స్టాఫ్ పాల్గొన్నారు.

# కృష్ణా కాలేజీ రోడ్డులో జీవీఎంసీ ఆకస్మిక తనిఖీలు

### టిఫిన్ సెంటర్‌లో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం..ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై రూ.2 వేల జరిమానా



**విశాఖపట్నం , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** నగరంలోని కృష్ణా కాలేజీ రోడ్డులో ఉన్న శ్రీ సాయి పుల్కా ఌ టిఫిన్ సెంటర్లో జీవీఎంసీ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గృహ వినియోగానికి ఉద్దేశించిన ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించడంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని గుర్తించి రూ.2,000 జరిమానా విధించారు. జీవీఎంసీ జోన్–2 ఏఎస్ఓ కల్యాణి ఆధ్వర్యంలో ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీఎస్ఆర్ఐ పల్లా మహేష్, ఎన్. నరేష్ తదితర సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. కృష్ణా కాలేజీ రోడ్డులో ఈ. శ్రీనివాస్ నిర్వహిస్తున్న శ్రీ సాయి పుల్కా ఌ టిఫిన్ సెంటర్ను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాణిజ్య కార్యకలాపాలకు గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్లను ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో అక్కడ ఉన్న సంబంధిత గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అదే టిఫిన్ సెంటర్‌లో తనిఖీలు కొనసాగించగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నిబంధనల ఉల్లంఘనపై టిఫిన్ సెంటర్‌కు రూ.2 వేల జరిమానా విధించారు. వాణిజ్య సంస్థలు సంబంధిత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. గృహ వినియోగానికి కేటాయించిన గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించరాదని, అలాగే నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నివారించాలని స్పష్టం చేశారు. నగరంలో నిబంధనలను ఉల్లంఘించే వ్యాపార సంస్థలపై తనిఖీలు కొనసాగుతాయని, వ్యాపారులు జీవీఎంసీ నిబంధనలను పాటిస్తూ సహకరించాలని అధికారులు సూచించారు.

### ప్రతి శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి జిల్లా అధికారుల వరకు విధులకు హాజరు తప్పనిసరి

### సచివాలయ సిబ్బంది హాజరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ : జిల్లా కలెక్టర్ టి. నిషాంతి




**పాడేరు , ఆగస్టు. 05 ( మనం న్యూస్ ) :** జిల్లాలోని అన్ని శాఖల్లో క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి జిల్లా అధికారుల వరకు ప్రతి ఉద్యోగి విధులకు క్రమం తప్పకుండా హాజరై బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిషాంతి ఆదేశించారు. బుధవారం పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె శాఖల వారీగా పనితీరు, లక్ష్యాల సాధన, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా అధికారులు మాత్రమే కాకుండా క్షేత్రస్థాయి వరకు ప్రతి ఉద్యోగి పూర్తి స్థాయిలో విధులు నిర్వర్తిస్తే జిల్లా అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. ప్రతి శాఖాధిపతి తమ పరిధిలోని సిబ్బంది హాజరును నిరంతరం పర్యవేక్షిస్తూ, సేవల అందింపులో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది హాజరు శాతం ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్, వచ్చే వారం రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం సచివాలయాల హాజరు నివేదికను జాయింట్ కలెక్టర్‌కు సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది హాజరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అదనపు జిల్లా వైద్య ఌ ఆరోగ్య అధికారి , జిల్లా గిరిజన సంక్షేమ అధికారి (ఐఐ ౧తీఅఎఖశ్రీ ఔవశ్రీట్ఘుతీవ)లకు సూచించారు. ఇంజినీరింగ్ శాఖల అధికారులు పురోగతి తక్కువగా ఉన్న మండలాలపై ప్రత్యేక నివేదికతో పాటు కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఆదేశించారు. అలాగే ఐవీఆర్ఎస్ పనితీరు శాతం తక్కువగా ఉన్న శాఖలు కారణాలను విశ్లేషించి, మెరుగుదలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను వెంటనే కలెక్టరేట్‌కు సమర్పించాలని సూచించారు. జిల్లా అధికారులందరూ తమ శాఖల సిబ్బందితో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి శాఖల వారీగా లక్ష్యాలు, పురోగతి, పెండింగ్ అంశాలపై సమీక్ష చేపట్టి, సమావేశాలకు సంబంధించిన ఫోటోలను జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో పంచుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఏపీ ఓపీటీజీఎం శ్రీ వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీమతి హేమలత, జిల్లా అధికారులు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.